ప్రజాశక్తి
శుక్రవారం 14 జూన్ 2024 | 5 | అనంతపురం





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సక్రమంగా నీటి ప్రాజెక్టుల నిర్వహణ

అధికారులు అప్రమత్తంగా పనిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో నీటి ప్రాజెక్టుల నిర్వహణపై సంబంధిత అధికారులు అప్రమత్తతో పనిచేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. గురువారం నాడు అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) ప్రాజెక్టుపై సంబంధిత ఎస్‌ఈ, ఈఈలు, డిఈలు, ఏఈఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు పరిధిలో ఇంజినీర్లు ఎప్పటికప్పుడు షెడ్యూల్ ప్రకారం తనిఖీలు నిర్వహించాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ, హెచ్‌ఎల్‌సి ఎస్‌ఈ, మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈలు ప్రతినెలా పర్యటన వివరాలను అందించాలన్నారు. ప్రాజెక్టు పరిధిలో ఏమైనా సమస్యలు ఉన్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. జిల్లా నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఈ, హెచ్‌ఎల్‌సి ఎస్‌ఈ, మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈలు ప్రతినెలా హెడ్ ఆఫీస్‌కి వెళ్లాలని, జిల్లా సమస్యలను రాష్ట్రస్థాయిలో ప్రస్తావించాలన్నారు. అధికారులు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్, హెచ్‌ఎల్‌సి, మైనర్ ఇరిగేషన్ పరిధిలో చేపట్టిన ప్రాజెక్టులు, కాలువల వివరాలు పూర్తిగా తెలిసేలా గూగుల్ మ్యాప్ తయారు చేసి ఇవ్వాలన్నారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, రిజర్వాయర్లలో చెట్లు, మొక్కల పెంపకానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని, నిపుణులతో సంప్రదించి ఎలాంటి ఇబ్బంది లేకుండా చెట్లు, మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రవహించే పెన్నా రివర్ పరిధిలో గట్లపై మొక్కల పెంపకం చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఎస్‌డిసి ఆనంద్, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఇ దేశే నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెన్నెల శ్రీను, ఈఈలు రాజస్వరూప్ కుమార్, నారాయణ నాయక్, ప్రతాప్, శ్రీనివాస నాయక్, డిఈఈలు కృష్ణదాస్ గుప్తా, గురునాథరెడ్డి, డిఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి శాఖపై సమీక్ష

అంతకుముందు ఆర్అండ్‌బి శాఖపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఆర్అండ్‌బి పరిధిలో రహదారులు ఎన్ని కిలోమీటర్లు ఉన్నాయి, మరమ్మతుల వివరాలు, పనుల పురోగతి అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో రహదారుల మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఈఈ రాజగోపాల్, వెంకటరమణ, డీఈలు బాలకాటమయ్య, శ్రీధర్ రెడ్డి, సురేష్ నాయక్, రవిశంకర్ రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

వాన..మూడింతలు అధికం..!

అనంతలో 305.3 శాతం... శ్రీసత్యసాయిలో 201.6 శాతం ఎక్కువ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



గతేడాది మొత్తం తీవ్ర దుర్భిక్షాన్ని చవిచూసిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈసారి సీజన్ ప్రారంభంలోనే అత్యధిక వర్షపాతం నమోదవుతోంది. అటు అనంతపురం, ఇటు సత్యసాయి జిల్లాలో రెండు చోట్ల జూన్ ప్రారంభం నుంచే అధిక వర్షాలు నమోదవుతున్నాయి. ప్రతి రోజూ ఏదోక చోట వర్షపాతం నమోదవుతేనే ఉంది. సాధారణం కంటే అనంతపురం జిల్లాలో మూడింతలు అధికంగా వర్షపాతం నమోదవగా, సత్యసాయి జిల్లాల రెండింతలు అధికంగా వర్షపాతం నమోదయింది. సీజన్ ప్రారంభంలోనే వస్తున్న వర్షాలతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

305.3 శాతం అధికం

అనంతపురం జిల్లాలో 31 మండలాల్లో పడిన వర్షపాతం సాధారణం కంటే 305.3 శాతం అధికంగ పడింది. ఈ జిల్లాలో జూన్, జులై రెండు మాసాల్లో పడేంత వర్షపాతం ఈ నెలలో ఇప్పటికే పడింది. జూన్, జులై నెలలు కలిపి అనంతపురం జిల్లాల సాధారణ వర్షపాతం 124.9 మిల్లీమీటర్లు అయితే ఇప్పటికే అనంతపురం జిల్లాలో 137 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. మండాల వారీగా చూస్తే అత్యధికంగా కూడేరు మండలంలో 934.5 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. ఇక్కడ ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 15.8 మిల్లీమీటర్లు అయితే 163.4 మిల్లీమీటర్లు వానపడింది. బెళుగుప్పలో 646.7 శాతం అధికంగా నమోదయింది. ఇక్కడ సాధారణ వర్షపాతం 30.4 మిల్లీమీటర్లు అవుతే 227 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. వజ్రకరూరులో 625 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. ఈ మండలంలో సాధారణ వర్షపాతం 29.3 మిల్లీమీటర్లు అయితే 212.6 మిల్లీమీటర్లు నమోదయింది. ఇలా 32 మండలాల్లోనూ సాధారణం కంటే వర్షపాతం అధికంగా నమోవడం గమనార్హం. జిల్లా మొత్తంగా చూసినప్పుడు ఇప్పటి వరకు 33.8 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 137 మిల్లీమీటర్లు నమోదయింది. అంటే సాధారణం కంటే 305.3 శాతం అధికంగా పడింది.

సత్యసాయిలో 201.6 శాతం అధికం

సత్యసాయి జిల్లాలోనూ వర్షపాతం సాధారణం కంటే 201.6 శాతం అధికంగా పడింది. ఇక్కడ 32 మండలాలకుగానూ 30 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదయింది. తక్కిన మండలాల్లోనూ మంచి వర్షపాతమే నమోదైంది. సత్యసాజిల్లాలో సాధారణ వర్షపాతం 36.6 మిల్లీమీటర్లు కాగా పడింది 110.4 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 201.6 శాతం అధికంగా పడింది. సత్యసాయి జిల్లాలో బత్తలపల్లిలో అత్యధికంగా 592 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. 33.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికిగానూ 230.6 మిల్లీమీటర్లు నమోదయింది. అగళి మండలంలో మాత్రం సాధారణ వర్షపాతం నమోదయింది. ఈ మండలంలో సాధారణ వర్షపాతం 44.9 మిల్లీమీటర్లుకాగా పడిన వర్షపాతం 50.2 మిల్లీమీటర్లు. 11 శాతం మాత్రమే అధికంగా పడింది. తక్కిన అన్ని మండలాల్లోనూ సాధారణం కంటే అధికంగానే వర్షపాతం నమోదయింది.

బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు

కలెక్టర్ వి.వినోద్ కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా బాలల పరిరక్షణ సమితి, చైల్డ్ హెల్ప్ లైన్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు సంబంధించిన చట్టాలను అమలు చేయడంలో డిసిపియు, చైల్డ్ హెల్ప్‌లైన్ విభాగం ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, చైల్డ్ లేబర్ ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. బాల్యవివాహాలకు సంబంధించి సమాచారం వచ్చిన వెంటనే సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల కేసు పెట్టాలని సూచించారు. జువైనల్ జస్టిస్, పోక్సో, పిసిపిఎన్డీటి, రైట్ టు ఎడ్యుకేషన్, తలాక్ సిస్టం, లాంటి ఎనిమిది రకాల చట్టాల గురించి అవగాహన ఉండాలన్నారు. ప్రతి చట్టం గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మారుమూల మండలాలైన బొమ్మనహాల్, డి.హీరేహాల్, పెదపప్పూరు, యల్లనూరు మండలాల్లో పర్యటించాలని, సీజన్ బట్టి కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి, జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారి మంజునాథ్, ప్రొటెక్షన్ ఆఫీసర్స్ వెంకటేశ్వరి, సంధ్య, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ కష్ణమాచారి, డిసిపిఒ సిబ్బంది వసంత, సంధ్య, వెంకటకుమార్, రమాదేవి, కమలాక్షి, సమీర్, రామాంజనమ్మ, చైల్డ్ లైన్ సిబ్బంది సురేష్, ఇర్ఫాన్, సుహాసిని, నిర్మల, నవీన్ పాల్గొన్నారు.

వరలక్ష్మీ సత్యనారాయణస్వామి కళ్యాణోత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని నేసేపేటలో వెలసిన శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో గురువారం వరలక్ష్మీ సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ గోపుర కలశాలకు నదీ జలాలతో కుంబాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులకు పసుపు, చందనాభిషేకం, సహస్రనామ పారాయణం, పుష్పాభిషేకం, శయనోత్సవం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ, ఎస్‌ఎస్‌వి సేవాసమితి, రస సిద్దేశ్వరస్వామి ఆలయ కమిటీ, పురంధర విఠల కోలాటం గ్రూప్, దుర్గామాత మహిళా గ్రూప్, వినాయక యూత్ గ్రూపులు ఉత్సవంలో పాలుపంచుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎపిఎస్‌ఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం

ఎపిఎస్‌ఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షులుగా కొత్తకోట హరీష్, ప్రధాన కార్యదర్శిగా బండి శివలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతపురం నగరంలోని ఏపీఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి జిల్లా కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే ప్రధాన అజెండాగా ఏపీఎస్‌ఎఫ్ పని చేస్తోందన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా వ్యవస్థలో జరుగుతున్న ఫీజు దోపిడీకి వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన, హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విధంగా భవిష్యత్తులోనూ ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఎఫ్ నగర అధ్యక్షులు గురుసాయి పాల్గొన్నారు.



నూతన అధ్యక్ష, కార్యదర్శులతో రాఘవేంద్ర

జెఎన్‌టియుకు ఎనిమిది పరిశోధన ప్రాజెక్టులు

రూ.86లక్షలు మంజూరు

రెండేళ్లలో పూర్తి చేసేలా చర్యలు

విసి జివిఆర్.శ్రీనివాసరావు



ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియుకు ఎనిమిది పరిశోధన ప్రాజెక్టులు దక్కాయని ఉపకులపతి జివిఆర్.శ్రీనివాస రావు గురువారం తెలిపారు. నూతన పరిశోధన ప్రాజెక్టుల ద్వారా వర్శిటీలో పరిశోధనలకు మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. రెండేళ్ల కాలపరిమితిలో వీటిని పూర్తి చేయాలనే నిబంధనలతో జాతీయ ఉన్నత విద్యా మిషన్ (రూసా) కింద మంజూరు అయిన ప్రాజెక్టులకు రూ.86లక్షల నిధులు వర్శిటీకి రానున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రీసెర్చ్, ఇన్నోవేషన్, క్వాలిటీ ఇంప్రూవ్ మెంట్ కింద నిధులు మంజూరు అయ్యాయన్నారు. విభాగాల వారీ చూస్తే సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో బి.అజిత నానో కాంక్రిట్ స్థిరత్వం అంచనా వేసేందుకు ప్రాజెక్టు మంజూరు అయ్యిందన్నారు. ఎలక్ట్రానిక్ విభాగం నుంచి డా॥ ఎస్.అరుణమస్తానికు మూర్ఛ రోగులకు తక్కువ ఖర్చుతో ఇంటి వద్దనే పరీక్షలు చేసుకునే పరికరాలు తయారు చేయడానికి ప్రాజెక్టు మంజూరు అయ్యిందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ విభాగం నుంచి డా॥డి.విష్ణు వర్ధన్‌కు క్లిష్టమైన జబ్బులను గుర్తించడానికి డీప్ లర్నింగ్ అల్గోరిటెమ్స్‌ను ఉపయోగించి మెడికల్ ఇమేజ్ అనాసిలాస్ చేయడానికి ప్రాజెక్టు మంజూరు అయ్యిందన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ విభాగం బి.దిలీప్ కుమార్‌కు బ్యాటరీలు, సూపర్ కెపాసిటర్ ఎలక్ట్రోడ్ మెటీరియల్, నీటి నుంచి హైడ్రోజన్, ఆక్సిజన్‌ను వేరు చేయడానికి ఉపయోగించే ఎలాక్ట్రోడ్ మెటీరియల్‌ను తయారు చేయడానికి ప్రాజెక్టు మంజూరు అయిందన్నారు. యస్‌వి.సత్యనారాయణకు ఇథనాల్ బయో ఫ్యూయల్ వాడడానికి కావాల్సిన సపరేషన్ టెక్నిక్స్ ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాన్ని పొందే పరికరాలను టెస్ట్ చేయడంకు ప్రాజెక్టు దక్కిందన్నారు. గణిత విభాగం నుంచి ఆర్.భువన విజయ మ్యాగ్నాటో హైడ్రానిక్ కనెక్టివేట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఇన్ మైక్రోపోలార్ ఫ్లూయిడ్స్ అనే ప్రాజెక్టు మంజూరు అయ్యిందన్నారు. గణిత విభాగం నుంచి ఇ.కేశవరెడ్డికు వయసులో పెద్ద వారు నడకలో కింద పడకుండా ఉండడానికి ఐఒటి మెషిన్ లర్నింగ్‌ను ఉపయోగించేలా ప్రాజెక్టును తయారు చేసేందుకు అవకాశం లభించిందన్నారు. సివిల్ విభాగం నుంచి సి.శశిధర్‌కు ఐరన్ ఓర్ వేస్టును కాంక్రిట్‌లో ఉపయోగించి కాంక్రీట్ స్థిరత్వాన్ని పెంచే ప్రాజెక్టు దక్కిందన్నారు. ప్రాజెక్టులు మంజూరు అయిన అధ్యాపకులకు విసి శ్రీనివాస రావుతో పాటు రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్‌లు అభినందనలు తెలిపారు.

సమస్యల వలయంలో ప్రభుత్వ బడులు.!

అర్ధాంతరంగా ఆగిన భవన నిర్మాణాలు - విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువు



తాగునీటి సౌకర్యం లేని లింగదహాల్ హైస్కూల్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. మండల వ్యాప్తంగా మొత్తం 42 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 26 ప్రాథమిక పాఠశాలలు, 16 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, వాటిలో 30 పాఠశాలలు నాడు-నేడు కింద ఎంపికైనట్లు మండల విద్యా శాఖ అధికారి(ఎంఇఒ) మల్లికార్జున తెలిపారు. నాడు-నేడు ద్వారా ఉద్దేహాల్ గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలకు రూ. 14 లక్షలు మంజూరు కాగా భవన నిర్మాణం పూర్తయినా ఇంకా రంగులు, తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయాల్సి ఉండడడంతో ఆ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ఇక సింగేపల్లి ఉన్నత పాఠశాలలో భవన నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. అలాగే నిధులు లేక బొమ్మనహాల్, చంద్ర గిరి, ఉంతకల్, దేవగిరి, కల్లుహోల, గోవిందవాడ, దర్గాహొన్నూరు, శ్రీధర్‌గట్ట జిల్లా పరిషత్ హైస్కూళ్ల లో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. నేమకల్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. అందులో 500 మంది విద్యార్థులు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతన పాఠశాల భవనాలు పునాదులకే పరిమితమయ్యాయి. దీంతో విద్యార్థులు ఆరుబయట విద్యా భ్యాసం సాగిస్తున్నారు. లింగదహాల్, దేవగిరి, చంద్రగిరి, నేమకల్ పాఠశాలల్లో నీటి సౌకర్యం లేకపోవ డంతో, అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నా బాలికలు మల మూత్ర విసర్జనకు ఆరుబయటకు వెళ్లా ల్సిన దుస్థితి నెలకొంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా పాఠశాలలకు నిధులు మంజూరు చేయించి అర్ధాంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిన్నారి

అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



చిన్నారిని అభినందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చిన్నారి క్రిస్టినా సియారా పేరు నమోదు చేయడంపై కలెక్టర్ వి.వినోద్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గుంతకల్లు పట్టణం మోదీనాబాద్‌కు చెందిన రైల్వే ఉద్యోగి (ఎలక్ట్రికల్ శాఖ) పి.సుధాకర్, సింధుల నాలుగు నెలల చిన్నారి క్రిస్టినా సియారా అతి చిన్న వయసులోనే ఫ్లాష్ కార్డులు (ఆల్ఫాబిట్స్, అనిమల్స్, ఫ్రూట్స్, బర్డ్స్ లాంటివి) గుర్తించడంతో నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసింది. గురువారం నాడు అనంతపురం కలెక్టరేట్లో చిన్నారి క్రిస్టినా సియారాతో కలిసి తల్లిదండ్రులు కలెక్టర్‌ను కలిశారు. చిన్నారిని 'వెరీగుడ్' అంటూ కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారికి ఎంతో ప్రతిభ ఉందని, భవిష్యత్తులో కూడా చిన్నారికి ప్రోత్సాహం అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. చిన్నారి తల్లితండ్రులు మాట్లాడుతూ 149 ఫ్లాష్ కార్డులను గుర్తించి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తమ కూతురు క్రిస్టినా సియారా పేరు నమోదు చేసిందన్నారు. ఇంతకుముందు కర్నాటకకు చెందిన చిన్నారి 125 ఫ్లాష్ కార్డులను గుర్తించిందని, ఆ పాప రికార్డును తమ కూతురు తిరగరాసిందని తెలిపారు. ఈనెల 7వ తేదీకి చిన్నారికి 3 నెలల 15 రోజుల వయస్సు అన్నారు. అతి చిన్న వయసులోనే వరల్డ్ రికార్డ్ నెలకొల్పి నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి సర్టిఫికేషన్ అందుకుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలకు పాల్పడితే చర్యలు

ఒంటిమిద్ది గ్రామస్తులతో డీఎస్పీ బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం



ఒంటిమిద్దిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు

కళ్యాణదుర్గం సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో ఎవరైనా, ఎంతటి వారైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ బి.శ్రీనివాసులు హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో గురువారం డీఎస్పీ ఆధ్వర్యంలో సిఐ, ఎస్ఐ సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సమస్యాత్మక గ్రామంగా పేరొందిన ఒంటిమిద్ది ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రాజకీయ పార్టీల నాయకుల మాటలు విని రెచ్చగొట్టే ప్రసంగాలు, దాడులు, ప్రతిదారులకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ముఖ్యంగా యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని క్రమశిక్షణతో నడుచుకోవాలన్నారు. అనివార్య కారణాల వల్ల పోలీస్ కేసుల్లో ఇరుక్కుంటే వ్యక్తిగత భవిష్యత్తుతో పాటు కుటుంబాల అభివృద్ధి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. రాజకీయాల్లో ఓటమి, గెలుపులు సహజమేనని వివరించారు. వ్యక్తులపై దాడులు, ఇళ్లపై ప్రతి దాడులు చేయడం నేరం అన్నారు. అల్లర్లు, గొడవలు, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా అందరితో కలిసి మెలిసి ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. డీఎస్పీతో పాటు సిఐ హరినాథ్, సిబ్బంది ఉన్నారు.

పొలాల్లో ఫ్యాక్టరీ దుమ్ము పడకుండా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని నేమకల్ రెవెన్యూ గ్రామ పరిధిలోని ఫిగ్రీన్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళి పంట పొలాలపై పడి రైతులు పంటలు నష్టపోతున్నారని సిపిఐ రైతు విభాగం నాయకులు శర్మ ఆధ్వర్యంలో రైతులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. శర్మ విలేకరులతో మాట్లాడుతూ ఫ్యాక్టరీ సమీపంలోని రైతులకు ఇస్తున్న నష్టపరిహారాన్ని పెంచాలని, ఫ్యాక్టరీ నుంచి డస్ట్ రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సాగు చేసిన పంటలపై ఫ్యాక్టరీ డస్ట్ పడి పంట దిగుబడి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి ఇచ్చిన వారిలో రైతు సంఘం తాలూకా ఉపాధ్యక్షుడు బషీర్, రైతులు మల్లప్ప, బసప్ప, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ హర్షణీయం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు మెగా డీఎస్సీ దస్త్రంపై తొలి సంతకం చేసి నిరుద్యోగుల జీవితాల్లో భరోసా కల్పించారని టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 16,347 పోస్టులకు పచ్చజెండా ఊపారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయంపై రాష్ట్ర వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నా యన్నారు. అలాగే ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు దస్త్రంపై రెండో సంతకం, సామాజిక పింఛన్లు రూ.4వేలకు పెంపు దస్త్రంపై మూడో సంతకం, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగు, నైపుణ్య గణనపై ఐదో సంతకం చేయడం చారిత్మక నిర్ణయమన్నారు.

సమగ్రశిక్ష ప్రాంతీయ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త వైకోం నిధియాదేవి గురువారం నాడు బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు సమీపంలోని సమగ్ర శిక్ష ప్రాంతీయ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. శిక్షణ కేంద్రంలో ఇంకా కల్పించాల్సిన అదనపు సౌకర్యాల గురించి పరిశీలించారు. ఎక్కడెక్కడ ఈ సౌకర్యాలు కల్పించాలి అనే విషయంలో అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఈఈ శంకరయ్య, డిఇ జయరాములు, ఎంఒ చంద్రశేఖర్ రెడ్డి, సీఎంవో గోపాల్, ఎంఇఒ నవీద అలెస్కో, గోవింద్ రెడ్డి పాల్గొన్నారు.



సమగ్రశిక్ష ప్రాంతీయ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నిధియాదేవి

ప్రజాశక్తి
www.prajasakti.com

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-వజ్రకరూరు

శాంతి భద్రతలకు విఘతం కలిగించేలా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించొద్దని ఎస్పీ గౌతమిశాలి ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చిన నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. నిరంతరం మొబైల్ పార్టీలతో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఇంకా అవసరమనుకుంటే పట్టణంలోనే కాకుండా గ్రామాల్లో కూడా పికెట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడితే చట్టపరంగా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, ఉరవకొండ అర్బన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సురేష్‌బాబు, ఎస్ఐ రాఘవేంద్రప్ప, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమిశాలి

నకిలీ పట్టాలతో భూ ఆక్రమణ

న్యాయం చేయాలంటున్న బాధిత రైతులు

ప్రజాశక్తి-తాడిపత్రిరూరల్

నకిలీ పట్టాలు సృష్టించి తమ భూమిని ఆక్రమిస్తున్నారంటూ మండల పరిధిలోని చల్లవారిపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం పట్టణంలోని తాడిపత్రి డీఎస్పీ జనార్ధన్‌నాయుడుకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బాధిత రైతు జ్యోతిలత మాట్లాడుతూ మండలంలోని చల్లవారిపల్లి గ్రామంలో ఉన్న సర్వేనెంబర్ 123-ఏలో కు చెందిన 3.58 ఎకరాల భూమి ఉందన్నారు. అయితే పట్టణానికి చెందిన కొందరు నకిలీ పట్టాలు సృష్టించి తహశీల్దార్ సంతకాన్ని సైతం ఫోర్జరీ చేసి గుడిసెలు వేసి ఆక్రమించేలా చూస్తున్నారని వాపోయారు. ఇదేంటని బాధిత రైతులు అడిగితే కులాన్ని అడ్డుపెట్టుకుని తమపై కేసులు వేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మీరైనా స్పందించి నకిలీ పట్టాలు సృష్టించి భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాల్లో 'ఉపాధి' పనులు కల్పించాలి

ప్రజాశక్తి-పుట్లూరు

గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పుట్లూరు, నాయనపల్లె గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఇందులో భాగంగా కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ కూలీలు రెక్కడితేగాని డొక్కాడని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి పడేలా చూడాలని కోరారు. అంతేగాకుండా వెంటనే కూలీల ఖాతాల్లో బిల్లులు జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్.సూరి. వ్యకాసం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, రైతుసంఘం కార్యదర్శి జి.వెంకటచౌదరి, భాస్కర్‌రెడ్డి, కెవిపిఎస్ నాగభూషణ్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.


కూలీలతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వ్యకాసం నాయకులు

మహిళల అభ్యున్నతికి కృషి

టిడిపి సీనియర్ నాయకులు 'పెరుమాళ్ల'


ప్రజాశక్తి-పామిడి

మహిళల అభ్యున్నతికి పాటుపడదామనిపిజెఆర్ సోషల్ సర్వీసెస్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి, వ్యాలీ గ్రీన్ గార్మెంట్ అధినేత్రి పెరుమాళ్ల మమతారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గజరాంపల్లిలో ఉన్న వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమలో అంతర్జాతీయ కుట్టుమిషన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల అభివృద్ధే తమ ధ్యేయమన్నారు. అందుకోసమే వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసి దాదాపు 2,000 మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఇందులో ప్రస్తుతం 350 మంది పని చేస్తున్నారన్నారు. వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమలో ఉద్యోగం కావాలనుకున్న వారు సెల్..63042 37701, 98885 39999 నెంబర్లను సంప్రదించాలన్నారు.


కుట్టు శిక్షణ తీసుకుంటున్న మహిళలు

అనాథ చిన్నారులకు ఆర్థికసాయం

నార్పల : మండల కేంద్రంలోని అనాథ చిన్నారులకు మండలంలోని యువకులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. స్థానిక కోటవీధిలో నివాసముంటున్న దస్తగిరి కొద్దికాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన పిల్లలు హాజీబు, ఇమామ్ వలీ అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న నార్పలకు చెందిన పలువురు యువకులు జట్టుగా ఏర్పడి చిన్నారులకు తమవంతుగా రూ.10వేలు నగదు, బియ్యం ప్యాకెట్, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలనాగి నరేష్, మొరుసు భాస్కర్‌రెడ్డి, కొట్టం నరసింహ, తలారి ప్రతాప్, భరత్, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న యువకులు

ప్రశాంతంగా జీవించాలి : సిఐ

పుట్లూరు : గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని సిఐ సుబ్రమణ్యం సూచించారు. గురువారం సాయంత్రం మండలంలోని చాలివేముల గ్రామంలో ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏమన్నా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాకాకుండా గొడవల జోలికి వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ సుబ్రమణ్యం

వేలంపాట వాయిదా వేయాలి

నార్పల : గ్రామ పంచాయతీకి సంబంధించిన ఆదాయ ప్రతిఫలాలు ఇచ్చే బస్టాండ్, వారపు సంత, మూత్రశాలలు, మరుగుదొడ్ల వేలంపాటను వాయిదా వేయాలని టిడిపి నాయకులు ఆకుల బాబు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారన్నారు. అయితే వారం రోజులపాటు వాయిదా వేయాలని కోరారు.

పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలి

కమిషనర్ వై.మేఘస్వరూప్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని పార్కులను సుందరంగా తీర్చిదిద్దాలని కమిషనర్ మేఘస్వరూప్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన నగరంలోని సిద్ధార్థ పార్కు అభివృద్ధి పనులు, జిమ్ పరికరాలను కమిషనర్ పరిశీలించారు. ఇందులో భాగంగా వాకింగ్ ట్రాక్ పనులు, గ్రీనరీ, లైటింగ్, తదితర సదుపాయాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు ఖాళీ స్థలంలో ఉన్న పిచ్చి మొక్కలు, రాళ్లను తీసివేయాలని ఆదేశించారు. నగరంలోని అన్ని పార్కులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. ముఖ్యంగా పార్కుల్లోని జిమ్ పరికరాలను పూర్తిగా వాడుకునేలా మరమ్మతులు చేయాలన్నారు. ప్రజలు సేదతీరడానికి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాల్సిన బాధ్యత నగరపాలక సంస్థపై ఉందన్నారు. ఆయా పనులు వెంటనే చేయాలని హార్టికల్చర్ ఎడి లక్ష్మీప్రసన్నను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇఇ సూర్యనారాయణ, డిఇ సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

వంక పూడికతీత పనులు పరిశీలన

నగరంలోని సూర్యానగర్ రోడ్డు, గంగా గౌరీ థియేటర్ వెనుక వైపు మరువవంకలో చేపట్టిన పూడికతీత పనులను కమిషనర్ మేఘస్వరూప్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసిన పూడికను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. మరువవంక చివరి వరకూ పూడిక తీసి వర్షం నీరు ముందుకు వెళ్లేందుకు ఆటంకం లేకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా పూడికను తొలగిస్తున్న సమయంలో ముళ్లపొదల్లో పూడికమట్టి అడ్డుగా లేకుండా చూడాలని ఆదేశించారు. అలాగే కమలానగర్, ఖాజానగర్, వేణుగోపాల్ నగర్, సూర్యనగర్ రోడ్డు, రాంనగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. 17వ సచివాలయ పరిధిలో తిలక్‌రోడ్డులో చెత్త సేకరణ పనులు, దోమల నియంత్రణ స్ప్రేయింగ్ పనులను పర్యవేక్షించారు. అన్ని డివిజన్లలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డ్రెయినేజీలు, కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి విష్ణుమూర్తి, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వై.మేఘస్వరూప్

ఆపదలో ఉన్నవారికి అండగా భగత్‌సింగ్ బ్లడ్ అసోసియేషన్

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి సరైన సమయంలో రక్తదానం చేసి ప్రాణాలను కాపాడుతున్నామని సిఐటియు అనుబంధ భగత్‌సింగ్ బ్లడ్ అసోసియేషన్ గ్రూప్ అధ్యక్షులు, సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు అన్నారు. గురువారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ గుంతకల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు లేని కారణంగా రక్తం అవసరమైన సందర్భాల్లో సరైన సమయానికి రక్తం లభించక అనేక మంది గర్భిణులు, రోడ్డు ప్రమాద బాధితులు ప్రాణాలు కోల్పోయారన్నారు. దీంతో సోషల్ మీడియాలో భగత్‌సింగ్ బ్లడ్ గ్రూప్స్ ఏర్పాటు చేసి అనేక మందికి రక్తదాతల సాయంతో ప్రాణాలను కాపాడుతున్నట్లు వివరించారు. కరోనా సమయంలోనూ అనేకమందికి అన్నదానం చేశామన్నారు. ప్రధానంగా గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశామన్నారు. ఆరేళ్లుగా దాదాపు 2,800 మంది రక్తదాతల సాయంతో ప్రాణాలు కాపాడామన్నారు. తాము చేసిన సేవలను గుర్తించి స్వచ్ఛంద సేవాసంస్థలు పలుసార్లు సన్మానించి అవార్డులు కూడా ఇచ్చామన్నారు. మరీ ముఖ్యంగా కరోనా సమయంలోనూ కూడా రక్త దాతలు భయపడకుండా ప్రాణాలను సైతం లెక్కజేయకుండా ఇతర జిల్లాలకు వెళ్లి అనేకసార్లు రక్తదానం చేశారని గుర్తు చేశారు. ప్రాణాలు కాపాడిన భగత్‌సింగ్ గ్రూప్ సభ్యులకు ప్రపంచ రక్తదాత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఇలాగే మన గ్రూపు కొనసాగిస్తూ అత్యవసరమైన వారికి రక్తదానం, సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు.


సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు (పాతచిత్రం

మాతాశిశు మరణాలను తగ్గించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో మాతాశిశు మరణాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి సూచించారు. జిల్లాలో గతమాసంలో జరిగిన మాతా,శిశు మరణాలకు కారణాలుపై సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, సిబ్బందితో గురువారం స్థానిక కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతాశిశు మరణాలు జరిగినప్పుడు మరణానికి కారణాలను పూర్తిస్థాయిలో తెలుసుకుని నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఐసిడిఎస్ అందించి పౌష్టికాహారాన్ని గర్భిణులు సక్రమంగా తీసుకునేందుకు కృషి చేయాలన్నారు. మాతృ మరణం జరిగినపుడు జిల్లా నోడల్ టీం క్షేత్రస్థాయికి వెళ్లి విచారించాలన్నారు. ప్రతి గర్భిణీని 12వారాలలోపు రిజిస్ట్రర్ చేసుకుని అన్నిరకాల వైద్య పరీక్షలు చేయాలన్నారు. ప్రసవ అనంతరం అధిక రక్తస్రావంతో ఎవరూ మరణించకూడదన్నారు. అలాగే రక్తహీనత, గుండె సంబంధిత సమస్యలు, తక్కువ ఎత్తు, గర్భంలో ఉమ్మ నీరు తక్కువ ఉన్నా, బిడ్డ పెరుగుదల లేకపోయిన హై రిస్క్ గర్భవతులను గుర్తించి ప్రత్యేక వైద్యసేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పాల్ రవికుమార్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి యుగంధర్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్యులు నవీన్‌కుమార్, రేణుక, శంకరనారాయణ, ఎంపిహెచ్ఇఒ లక్ష్మన్న, ఎంపిహెచ్ఎస్ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

కమిషనర్ మేఘస్వరూప్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మలేరియా విభాగం అధికారి ఓబులు, నగరపాలక ఆరోగ్య అధికారి డాక్టర్ విష్ణుమూర్తితో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా మొదలగు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి, మలేరియా విభాగం అధికారులతో సమన్వయం చేసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే మలేరియా వర్కర్లకు అవసరమైన మాస్కులు, గ్లౌజులు, బూట్లు తదితర సామగ్రి అందజేయాలని ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తికి సూచించారు. అదేవిధంగా యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ ఆపరేషన్ నిర్వహించడానికి అవసరమైన సాంకేతిక శిక్షణ ఇవ్వాలన్నారు. రేపు మధ్యాహ్నం మూడు గంటల నుండి ఐదు గంటల వరకు మలేరియా వర్కర్స్, నగర పాలక సంస్థ శానిటేషన్ సిబ్బందికి మందుల మోతాదు వివరాలు, స్ప్రెయర్, ఫాగింగ్ యంత్రాల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సబ్ యూనిట్ సిబ్బంది ఎంహెచ్ఓతో కలిసి వర్కర్ల పని తీరును పర్యవేక్షించాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించేటప్పుడు ఆరోగ్య సిబ్బంది ప్రజలకు దోమల వల్ల వచ్చే జ్వరాలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా ప్రజలకు ఆరోగ్య విద్య అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, మలేరియా అసిస్టెంట్ శంకరయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మేఘస్వరూప్

అంగన్‌వాడీల 'బడిబాట'

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని సోదనపల్లి గ్రామం బీసీ కాలనీలో గురువారం అంగన్వాడీల బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్వాడీ పిల్లలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ బి.రత్నమ్మ మాట్లాడుతూ మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లల్ని తప్పకుండా అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. అంగన్వాడీల్లో చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ చిన్నారులను అంగన్వాడీల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా రామాంజినమ్మ, భారతమ్మ, లక్ష్మీదేవమ్మ, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని రేగులకుంట అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి 3 నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్వాడీలో చేర్పించాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు విమల, సుజాత, స్వాతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించడం ద్వారా ప్రభుత్వం మంచి పౌష్టికాహారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయాలు ఎర్రినాగమ్మ, ఎరికిలమ్మ, రత్నమ్మ, సరస్వతి, ఊర్మిళ, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


సోదనపల్లి బడిబాటలో పాల్గొన్న విద్యార్థులు, అంగన్వాడీలు

వజ్రకరూరు : అంగన్వాడీ బడిబాట చిన్నారుల భవిష్యత్తుకు పూలబాట అని విడపనకల్లు మండలం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయ అన్నారు. గురువారం మండల పరిధిలోని చీకులగురికి గ్రామంలో అంగన్వాడీలు అంగన్వాడీ టీచర్లు బడిబాట నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్చాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు హేమలత, శ్రీలక్ష్మి, శారద, అంగన్వాడీ ఆయాలు, తల్లులు, కిషోర బాలికలు, గ్రామపెద్దలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


విడపనకల్లు మండలంలో అక్షరాభ్యాసం చేస్తున్న అంగన్వాడీలు

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

కళ్యాణదుర్గం : పలు చోరీ కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సిఐ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం సిఐ కంబదూరు ఎస్ఐ ఆంజనేయులుతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కంబదూరు మండలంలోని నూతిమడుగు గ్రామానికి చెందిన చాకలి రాఘవేంద్ర, వీరాంజనేయులు కళ్యాణదుర్గం రూరల్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ట్రాన్సఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు దొంగలించారన్నారు. అందిన సమాచారం మేరకు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా వాస్తవాలు బయటపడ్డాయన్నారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, చోరీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బొలెరో

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని రావివెంకటాంపల్లి సమీపంలో తాడిపత్రి-అనంతపురం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బొలేరో వాహనం ఢీకొన్న ఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో యల్లనూరు మండలం 85-నిట్టూరు గ్రామానికి చెందిన స్వామిదాస్, పుష్పతకు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై తాడిపత్రి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇసుక టిప్పర్ సీజ్

పెద్దపప్పూరు : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను గురువారం సీజ్ చేసినట్లు ఎస్ఐ గౌస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కా సమాచారంతో ఇసుకతో వెళ్తున్న టిప్పర్‌ను మండలంలోని నర్సాపురం వద్ద అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. టిప్పర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మలేరియా నివారణపై ర్యాలీ

వజ్రకరూరు : మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, కార్యదర్శి గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో మలేరియా నివారణపై గురువారం ఉరవకొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి మాట్లాడుతూ ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. డ్రై డే కార్యక్రమాన్ని గురించి ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ, సచివాలయం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నేడు డయల్ యువర్ డిఎం

అనంతపురం : శుక్రవారం నాడు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మేనేజర్ నాగభూపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం డిపో రవాణా సమస్యలు, సలహాలు, సూచనలపై ఎవరైనా ఫోన్‌నెంబర్లు 085542 48553, 99592 25853కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు.

దుకాణం ఏర్పాటుకు ఆర్థికసాయం

అనంతపురం : ప్రవాస భారతీయుల స్వచ్ఛంద సేవా సంస్థ 'హోప్ ఫర్ స్పందన' ఆధ్వర్యంలో కిరాణా దుకాణం ఏర్పాటుకు గురువారం వితరణ చేశారు. రాప్తాడు మండలం, ఉప్పరపల్లి పంచాయితీ పరిధిలో నిరుపేద హుస్సేన్‌బీ కుటుంబానికి స్వయం ఉపాధిలో భాగంగా దాదాపు రూ.1.50 లక్షలు వెచ్చించి దుకాణం ఏర్పాటు చేయించారు. సంస్థ ఉపాధ్యక్షుడు లక్ష్మీ నరసింహం కోట పర్యవేక్షణలో, రెండు తెలుగు రాష్ట్రాల సంస్థ సమన్వయకర్త డా.రఘు ఆరికపూడి ఆధ్వర్యంలో, సంస్థ సభ్యులు నంద్యాల రఘునాథ్, ట్రెడ్ సంస్థ సభ్యులు ఎం.సుధాకర్, రాజ్‌కుమార్, దయ్యాల మహేష్, గ్రామస్తుల సమక్షంలో దుకాణాన్ని ప్రారంభించారు.


దుకాణాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

గుత్తి-గుంతకల్లు రహదారికి మరమ్మతులు

గుత్తి : గుంతకల్లు-గుత్తి మార్గంలో 67వ జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు ధాతృత్వంతో గురువారం పూడ్చివేశారు. కొన్నేళ్లగా ఓ కంపెనీ నూతన జాతీయ రహదారిని నిర్మిస్తుండగా ఆమార్గంలో వంతెనల వద్ద రహదారి పనులు పూర్తికాకపోవటంతో గుంతలు ఏర్పడ్డాయి. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు ఆ రహదారిపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది గ్రహించిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ తన సొంత ఖర్చులతో ఎర్రమట్టిని తరలించి హిటాచీ ద్వారా పూడ్చివేశారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌సిసి విద్యార్థులకు యూనిఫాం అందజేత

పామిడి : స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సిసి క్యాడెట్స్‌కు గురువారం యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులు జయానాయక్, సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్‌సిసి శిక్షణ తీసుకోవడం వల్ల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అంతేగాకుండా భవితకు భరోసా వస్తుందన్నారు. ఎన్‌సిసి సర్టిఫికెట్లతో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌కుమార్, ఎన్‌సిసి అధికారి వై.రామాంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు, మాజీ ఆర్మీ లక్ష్మీనారాయణ, ఆర్మీ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యాధికారి

మంత్రులను కలిసిన జిల్లా టిడిపి నాయకులు

అనంతపురం : టిడిపి ప్రభుత్వంలో నూతనంగా ఎన్నికైన పలువురు మంత్రులను పలువురు టిడిపి జిల్లా నాయకులు కలిసి సత్కరించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరపు అచ్చన్నాయుడు, పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, టీజీ భరత్, తదితర మంత్రులను వారి నివాసాల్లో కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావును కలిశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్, ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకులు కెఎం షకీల్‌షఫీ, కాపు కార్పొరేషన్ మాజీడైరెక్టర్ రాయల్ మురళీమోహన్, నాయకులు బుగ్గయ్యచౌదరి, తాజుద్దీన్, కాయగూరల శ్రీధర్, అనిల్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


అచ్చెన్నాయుడుకు బొకే అందజేస్తున్న నాయకులు

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి పట్టణం, పరిసర మండలాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గౌతమిశాలి ఆదేశించారు. గురువారం తాడిపత్రి అర్బన్, రూరల్ యు.పి.ఎస్ పోలీసుస్టేషన్లను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పోలింగు రోజు, ఆతర్వాత తాడిపత్రి ప్రాంతంలో చెలరేగిన ఘర్షణలు, అల్లర్లకు సంబంధించిన కేసులను సమీక్షించారు. పగలు, రాత్రి వేళల్లో నిర్వహించే బీట్స్ పెంచాలన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్ పై గట్టి నిఘా వేయాలన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేలా పరిస్థితులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి డీఎస్పీ జనార్ధన్ నాయుడు, సి.ఐ లు నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.